తీరం.. పుష్పశోభితం

- విభిన్న వర్ణాల పుష్పాలతో శోభిల్లుతున్న సాగరతీరం
- జీ20 సదస్సు సందర్భంగా నాటిన మొక్కలతో బీచ్ రోడ్డుకు కొత్త అందం


బీచ్ రోడ్డులో మొక్కలతో ఆకర్షణీయంగా డివైడర్

ఏయూక్యాంపస్: నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది.. పర్యాటకుల మదిని దోచుకునేది విశాఖ సాగరతీరం.. నగరాన్ని సందర్శించే ప్రతి పర్యాటకుడు సాగర తీరానికి రాకుండా తమ పర్యటన ముగించరు. అటువంటి సాగర తీరాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దే దిశగా పనిచేస్తున్న అధికారులు, పాలకుల చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. జీ20 సదస్సు నేపథ్యంలో బీచ్ రోడ్డులో నాటిని విభిన్న మొక్కలు నేడు అందమైన పుష్పాలతో తీరానికి మరింత శోభను చేకూర్చాయి.

అధికారుల సంరక్షణలో..

ఆర్కే బీచ్ నుంచి వీఎంఆర్డీఏ పార్క్ వరకు వెళ్లే మార్గాన్ని పూర్తి స్థాయిలో జీ 20 సదస్సు సమయంలో సుందరంగా తీర్చిదిద్దారు. సాగరతీరానికి అభిముఖంగా ఉన్న ప్రాంతాలను, రహదారి మధ్యలో ఉన్న డివైడర్లను విభిన్న జాతుల మొక్కలు, లతలను నాటారు. సదస్సు ముగిసిన తరువాత సైతం అధికారులు వీటి సంరక్షణ బాధ్యతలను కొనసాగిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిబ్బందితో వీటికి రక్షణ కల్పించడం, అవసరమైన నీరు పోయడం వంటివి చేస్తున్నారు. దీంతో మొక్కలు అందమైన పుష్పాలతో కనువిందు చేస్తున్నాయి.

పర్యాటకులు, వాకర్స్‌కు కనువిందు..

మొక్కల ఎంపికలో వైవిధ్యతను చూపిన అధికారులు తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విభిన్న వర్ణాలు కలిగిన ఆకులు, పుష్పాలతో తీరం మెత్తం ఆకర్షిస్తోంది. డివైడర్లలో నాటిన మొక్కలు సైతం ఒక్కో ప్రాంతంలో ఒక్కో వైవిధ్యత కలిగిన వాటిని ఎంపిక చేసి తీర్చిదిద్దిన విధానం నేడు మంచి ఫలితాలను ఇస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సాగరతీరంలో నడకకు వచ్చే వారికి, నగరాన్ని సందర్శించే పర్యాటకులకు అందమైన మొక్కలు, పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. విశాఖ నగరాన్ని మరింత శోభాయమానంగా, పర్యాటకులను ఆకర్షించడానికి ఉపయుక్తంగా ఈ మొక్కలు నిలుస్తాయి. సాగరతీరానికి వచ్చే పర్యాటకులు తీరంలోని కొబ్బరి చెట్ల వద్ద, ఎదురుగా ఉన్న పచ్చిక మైదానాలు, అందమైన మొక్కల వద్ద ఫొటోలు తీసుకోవడానికి, పుష్పాలను తిలకించడానికి ఆసక్తి చూపుతున్నారు.


విరిసిన పుష్పాలతో తీరం అందాలు


డైనోసార్ పార్క్ వద్ద ..


పాండురంగాపురం చేరువలో విభిన్న వర్ణాలలో..

మన చేతల్లోనే సంతోషం


ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: సంతోషం మనిషి చేతల్లోనే ఉంటుందని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సైకాలజీ విభాగంలో 'హ్యూమన్ హ్యాపీనెస్(కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ)' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమస్య ఉత్పన్నమైనపుడు చికిత్స చేయడం కంటే.. అది ఎదురవకుండా చూడటం ప్రధానమన్నారు. ఈ దిశగా పాఠశాల స్థాయి నుంచి చిన్నారులను సిద్ధం చేయాలన్నారు. మానసిక నిపుణులు దీనికి అవసరమైన శిక్షణ అధ్యాపకులు అందించాలని సూచించారు. తద్వారా మంచి పౌరులను తీర్చిదిద్దడం, మానవ ఆనందం, ఆరోగ్యం సంరక్షించడం సాధ్యపడుతుందన్నారు.

సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ ఒత్తిడి కారణంగా రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు పెరిగిపోతున్నాయన్నారు. మంచి మానవ సంబంధాలను కలిగి ఉండటం ఎంతో ప్రధానమన్నారు. కొన్ని రకాల రోగాలకు వైద్యంతోపాటు కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక సమస్యలను దూరం చేయడానికి యోగా ఒక సాధనంగా పనిచేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మానసిక సమస్యలు పెరగడం ఆందోళన కలిగించే అంశగా మారుతోందన్నారు. సదస్సులో నిపుణులు అందించే ప్రసంగాలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఎస్ఆర్ఐ మెడికల్ కళాశాల విభాగాధిపతి డాక్టర్ సి.రాధాకాంత్ మాట్లాడుతూ నేడు టెలీ సైక్రియార్టీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆలోచనలు, మనస్సు, ప్రవర్తన సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి తదితరులు ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

'అపోలో' వైద్యుడికి అరుదైన బిరుదు


ఆర్థోపెడిక్ వైద్యుడు ఖాన్

ఆరిలోవ: స్థానిక హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ ఖాన్‌కు అరుదైన ×ప్రొఫెసర్₹ బిరుదు లభించింది. న్యూఢిల్లీలో మూడు రోజుల కిందట జరిగిన కార్యక్రమంలో ఏహెచ్ఈఆర్ఎఫ్ పాలక కమిటీ ప్రతినిధులు డాక్టర్ ఖాన్‌కు ప్రొఫెసర్ బిరుదుతో కూడిన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శనివారం హెల్త్‌సిటీలో అపోలో హాస్పిటల్ నిర్వాహకులు, వైద్యులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాన్ మాట్లాడుతూ యూకేలో ఆర్థోపెడిక్ విభాగంలో నాలుగు పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలు పొందినట్లు తెలిపారు. వాటి ద్వారా సాధించిన పరిజ్ఞానం, నైపుణ్యంతో ఆర్థోపెడిక్‌లో 50 ప్రచురణలు చేసినట్లు చెప్పారు. అంతర్జాతీయ సదస్సుల్లో వాటి గురించి వివరించినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు ఆయన పరిశోధనలను లిస్బన్‌లో ఎఫెర్ట్ కాన్ఫెరెన్స్, కౌలాలంపూర్, మలేషియాలో సికోట్ వరల్డ్ కాంగ్రెస్, ఆస్ట్రియాలో వియన్నా ఎఫెర్ట్ కాన్ఫెరెన్స్‌లలో సమర్పించినట్లు తెలిపారు. బ్రిటీష్ ఆర్థోపెడిక్ అసోసియేషన్‌లో సభ్యుడిగా, మరో 14 జాతీయ, అంతర్జాతీయ వృత్తి పరమైన సంస్థల్లో మెంబర్‌గా ఉన్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే అరుదైన 20 వరకు శస్త్ర చికిత్సలు చేసినట్లు చెప్పారు. వీటిని పరిగణలోకి తీసుకొని తనకు ప్రొఫెసర్ బిరుదు ఇచ్చినట్లు డాక్టర్ అబ్దుల్ ఖాన్ తెలిపారు.

క్లుప్తంగా

సైన్స్, గణిత సబ్జెక్టులపై పట్టు సాధించాలి

ఎంవీపీకాలనీ: స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు సైన్స్, గణిత సబ్జెక్టులపై అధ్యాపకులు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే ఈ సబ్జెక్టులపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. తద్వారా భవిష్యత్‌లో అవకాశాలు పెరుగుతాయన్నారు. ఆయా సబ్జెక్టులు నేర్చుకోవడంలో మెలుకువలు తెలియజేశారు. అనంతరం పిల్లలకు ఆటవిడుపుగా క్రీడా పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఉమా మహేశ్వరరావు పర్యవేక్షించిన ఈ కార్యక్రమాల్లో 26 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జూలో ఆరోగ్యంగా మొసలి పిల్లలు


హుషారుగా తిరుగుతున్న మొసలి పిల్లలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఇటీవల పొదగబడిన మొసలి పిల్లలు హుషారుగా తిరుగుతున్నాయి. ఇక్కడ ఓ మొసలి పెట్టిన గుడ్లను జంతు సంరక్షకులు పొదిగించిన విషయం తెలిసిందే. వాటి నుంచి సుమారు 10 వరకు పిల్లలు వచ్చినట్లు ఈ నెల 25న యానిమల్ కీపర్లు గుర్తించారు. అవన్నీ తల్లి చాటున హుషారుగా తిరుగుతున్నాయని, ఆరోగ్యంగా ఉన్నాయని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 15 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు శనివారం 15 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంటెండ్ నాగమణి తెలిపారు. ఉదయం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 247 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. 11 మంది గైర్హాజరు కావడంతో 236 మంది పరీక్ష రాశారని చెప్పారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 56 మంది హాజరు కావాల్సి వుండగా.. నలుగురు గైర్హాజరయ్యారన్నారు.

దేశ సంప్రదాయాలను గౌరవిద్దాం


మూలా వెంకటరావు

మద్దిలపాలెం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ కొత్త భవనాన్ని ప్రారంభించే విషయంలో భారతీయ సంప్రదాయానికి అత్యధిక విలువ ఇవ్వాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో కోరారు. దేశ ప్రథమ పౌరురాలికి అన్నింట్లో అగ్రస్థానం ఇవ్వడం భారతీయ సంప్రదాయమన్నారు. ప్రతిపక్షాలను తోడుతీసుకెళ్లి రాష్ట్రపతిని ఆహ్వానించే సంప్రదాయానికి పెద్దపీట వేయాలన్నారు. దేశ ప్రజల సమష్టి ఆస్తి అయిన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని రాష్ట్రపతి, ప్రధాని, ఇతర విపక్ష నాయకులు కలిసి చేయాలని ఆయన సూచించారు. అప్పుడే దేశానికి ప్రపంచ వ్యాప్తంగా గౌరవం లభిస్తుందన్నారు.

గురుకుల జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్ష నేడు

పరవాడ: తానాం మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ మీసాల అప్పలనాయుడు చెప్పారు. ఎంట్రన్స్ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకొన్న హాల్‌టికెట్‌ను వెంట తీసుకురావాలని చెప్పా రు. పరీక్షా కేంద్రానికి గంట ముందు రావాలని పేర్కొన్నారు. పరీక్ష 495 మంది విద్యార్థులు రాయనున్నారు. హాల్‌టికెట్ పొందడానికి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసిన సమయంలో కోడ్ చేసిన ఆధార్, ముబైల్ నెంబరు, ఐడీ నెంబర్లను ఎంటర్ చేస్తే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతుందని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు చెప్పారు.

విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలన


చంద్రపాలెం స్టాక్ పాయింట్‌లో బూట్లు పరిశీలిస్తున్న పైడిరాజు

విశాఖ విద్య: జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతపై శనివారం ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. 2023–24 విద్యా సంవత్సరం బడి తెరిచిన రోజునే విద్యార్థులందరికీ కిట్లు అందించేలా ఇప్పటికే పూర్తి స్థాయిలో వస్తువులన్నీ జిల్లాకు సరఫరా అయ్యాయి. వాటిని ఎంపిక చేసిన స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లులో నాణ్యతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన వస్తువుల నాణ్యత తనిఖీల కోసమని డీఈవో లక్ష్మణరావు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎంఈవోల నేతృత్వంలో ఆయా మండలాల్లోని ముగ్గురు సీనియర్ హెచ్ఎంలను సభ్యులుగా ప్రత్యేక టీమ్‌లను నియమించారు. వీరంతా స్టాక్ పాయింట్లను సందర్శించి, కిట్లను సమగ్ర పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు స్టాక్ పాయింట్లను తనిఖీ చేశాయి. చైల్డ్ ఇన్ఫో గణాంకాల మేరకు స్టాక్ పాయింట్లకు వచ్చిన వస్తువులు, నిల్వ ఉన్న వస్తువులు, వాటి నాణ్యత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ నివేదిక డీఈవోకు అందజేస్తామని చినగదిలి మండల తనిఖీ బృందంలోని సభ్యులు, సీనియర్ హెచ్ఎం ఇమండి పైడిరాజు తెలిపారు.

ఘంటసాలపై నాటక ప్రదర్శన నేడు

మద్దిలపాలెం: ఘంటసాల జీవిత చరిత్ర ఇతివృత్తంతో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి నాటకాన్ని ప్రదర్శించనున్నామని రంగసాయి వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తెలిపారు. దేశంలో తొలిసారిగా రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీసాయి సంతోషి నాట్యమండలి సురభి వారిచే భాస్కరుని సత్య జగదీష్ రచన, దర్శకత్వంలో నాటకం ప్రదర్శించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు తొలి ప్రదర్శన, రాత్రి 7.30 గంటలకు రెండో ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర ప్రముఖులు పాల్గొనున్నారని తెలిపారు. ఇదే వేదికపై చిన్నారులతో లవకుశ పాటల ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు. టిక్కెట్లు కొనుగోలు చేసుకున్నవారు, వారికి నిర్దేశించిన సమయం ప్రకారం ప్రదర్శనలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94404 58458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్యావరణంపై అవగాహన అవసరం


జూలో ఆంగ్ల పదం లైఫ్ ఆకారంలో విద్యార్థులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొద్ది రోజులుగా లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యార్థులు, సందర్శకులకు పర్యావరణంపై జూ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వారిచే ఆంగ్ల పదం లైఫ్ ఆకారంలో నిలబెట్టి ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కలుగుతోందన్నారు. ఇందులో భాగంగా జూలో చిరుధాన్యాల వినియోగంపై అవగాహన, సీతాకోకచిలుకల సంరక్షణ తదితర వాటి గురించి విద్యార్థులకు, సందర్శకులకు ఆమె వివరించారు.

'కంటి వెలుగు' విజయవంతం చేయాలి


యూపీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. అప్పుఘర్ వద్ద ఫిషర్‌మెన్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో మాట్లాడారు. అవ్వాతాతలకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం గురించి అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహన చోదకులు భాగస్వాములు కావాలి

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణలో వాహనచోదకులు భాగస్వాములు కావాలని రవాణా శాఖ అధికారులు కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాల ఇంజిన్ ఆపాలని కోరుతూ మద్దిలపాలెంలోని సిగ్నల్ పాయింట్ వద్ద శనివారం మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్లకార్డులను ప్రదర్శించారు. ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ తప్పక ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని, రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆర్టీవో ఐ. వేణుగోపాలరావు, మోటారు వాహనాల తనిఖీ అధికారులు ఎం.బుచ్చిబాబు, బి.బాలాజీరావు, ఆర్.సుధీర్, మోటారు వాహనాల తనిఖీదారులు శ్రీనివాస్‌యాదవ్, పి.శిరిషాదేవి, లలిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీవో ఐ.వేణుగోపాలరావు మాట్లాడుతూ లైఫ్ మిషన్ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించామని తెలిపారు. 30, 31 తేదీల్లో పొల్యూషన్ కంట్రోల్‌కు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు


మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్, చిత్రంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాదరాజు

మహారాణిపేట: రైతు భరోసా కేంద్రాలు ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై రైతులకు సరఫరా చెయ్యాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీఏ ప్రసాద్ రాజు అధ్యక్షతన జేసీ విశ్వనాథన్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖ, సూక్ష్మ సేద్యం, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఖరీఫ్ 2023 సీజన్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా తగిన స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ జేడీ కె.మన్మథరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, పీడీ ఏపీఎంఐపీ, డీఎం మార్క్ ఫెడ్, ఏపీ సీడ్స్ అభివృద్ధి అధికారి సాయినాథ్, ఏడీ మార్కెటింగ్ యాసిన్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

యారాడ బీచ్‌లో క్లీన్ డ్రైవ్


బీచ్‌లో సేకరించిన వ్యర్థాలను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన నేవీ సిబ్బంది

సింధియా: స్వచ్ఛ మైన నీటి వనరులే లక్ష్యంగా ప్రారంభమైన పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం యారాడ బీచ్ క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. ఇండియన్ కోస్ట్ షిప్ సముద్ర పెహ్రేదార్ అధికారులు, నావికులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 150 మంది ఈ బీచ్ క్లీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సముద్ర తీర ప్రాంతాలను ప్రభావితం చేసే ప్రమాదకరమైన కాలుష్య కారకాలను నియంత్రించడమే లక్ష్యంగా ఐసీజీ సిబ్బంది నిర్వహించిన కార్యక్రమంలో బీచ్‌ను సందర్శించడానికి పర్యాటకులు సైతం చురుగ్గా పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు.

ట్రాఫిక్ పోలీసులకు శీతల పానీయాల కిట్లు


ట్రాఫిక్ పోలీస్‌కు కిట్లు అందిస్తున్న లండన్ మిషన్ మెమోరియల్ యూత్ బృందం

మద్దిలపాలెం: మండుటెండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు వేడిమి నుంచి ఉపశమనానికి వన్ టౌన్‌లోని లండన్ మిషన్ మెమోరియల్ సీఎస్ఐ యూత్ బృందం శనివారం శీతల పానీయం కిట్లు అందజేశారు. మద్దిలపాలెం, సిరిపురం, సత్యం జంక్షన్, వీఐపీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులకు డ్రింక్ బాటిల్, వాటర్ బాటిల్, బిస్కట్లు, పండ్లు, ఓఆర్ఎస్, నాప్‌కిన్స్, స్నాక్స్ తోకూడిన కిట్లు సంఘ రెవరెండ్ విన్సెంట్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సెక్రటరీ బి.ఎ.ఎస్.రాజమణి, యూత్ సెక్రటరీ హెన్రీ జస్టిన్, ఎడ్వర్డ్, యూత్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.

సేవకులకు 'ప్రభా' అవార్డుల ప్రదానం


సిద్ధురెడ్డికి అవార్డు అందజేస్తున్న మౌలానా బాబా

బీచ్‌రోడ్డు: చిన్ననాటి నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని వక్తలు పేర్కొన్నారు. పేదలకు ఆశ్రయం కల్పించడమే కాకుండా పిల్లలకు ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్న ప్రభా క్రికెట్ అకాడమీ సంస్థ రెండో వార్షికోత్సవం బీచ్ రోడ్డులోని ఓ హోటల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సిద్ధురెడ్డి(హైదరాబాద్), ముదిరాజ్, సింధు మాతాజీ(చిత్తూరు), బొడ్డేపల్లి రఘు, దాసరి శ్రీను, మనూ, సిహెచ్.భార్గవ్ తదితరులకు జనసేన పార్టీ నేత ముక్కా శ్రీను, సంఘ సేవకుడు మౌలానా బాబా, విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానంద స్వామీజీ తదితరుల చేతుల మీదుగా పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. ప్రభా అకాడమీ వ్యవస్థాపకుడు ప్రభాను స్వామీజీ ఆశీర్వదించారు. అనంతరం అతిథులంతా ప్రభా అకాడమీ సేవలను కొనియాడారు. భవిష్యత్తులో ఈ సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సంఘ సేవకుడు సిద్ధురెడ్డి మాట్లాడుతూ ధనవంతులు మాత్రమే సేవ చేయాలేమోనని భావించొద్దని, మాట సాయం వల్ల కూడా ఎంతోమంది ఉపశమనం పొందారన్నారు. ఆధ్యాత్మిక వేత్త సింధు మాతాజీ అందరికీ అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో బాక్సర్ చందు, గొంప కిషోర్ తదితర సేవాపరులు పాల్గొన్నారు.

పీబీఆర్ ప్రాజెక్టులో భాగస్వాములైన విద్యార్థులు


ప్రాజెక్టులో పాల్గొన్న ఏయూ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డ్, ఆంధ్రప్రదేశ్‌లోని ఎంపిక చేసిన జిల్లాల్లో, సంవృద్ధిగా జీవవైవిధ్యం ఉన్న పీపుల్ బయో డైవర్సిటీ రిజిస్టర్(పీబీఆర్) నవీకరణ–పరిశీలనను ప్రారంభించింది. జీవవైవిధ్యం సంవృద్ధిగా ఉన్న జిల్లాలను ప్రాజెక్టులో భాగం చేయగా విశాఖ జిల్లాలోని ఎంపికైన అనంతగిరి, పాడేరు, పెదబయలు, ముంచింగపట్టు, నర్సీపట్నం, అచ్యుతాపురం మండలాల్లోని 60 గ్రామాలను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. మాజీ డీఎఫ్‌వో డాక్టర్ జానకీరామ్ మార్గదర్శకత్వంలో ఆంధ్రా యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగానికి చెందిన ఆచార్య ఎస్.పడాల్, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల బోటనీ విభాగం విభాగాధిపతి డాక్టర్ కె.మాణిక్య కుమారి ప్రోగ్రాం ఇన్‌చార్జిలుగా పనిచేస్తున్నారు.

10 మంది ఎంపిక..

జిల్లాకు చెందిన సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల, ఆంధ్రా యూనివర్సిటీలో పీజీ చదువుతున్న 10 మంది విద్యార్థులను ఎంపిక చేసి, పీబీఆర్ అప్‌డేషన్ వర్క్‌పై శిక్షణ అందించారు. ఈ నెల 23 నుంచి జూన్ 3 వరకు వెరిఫికేషన్ పూర్తి చేసేందుకు ఒక్కో విద్యార్థికి 6 గ్రామాలను కేటాయించారు. మొత్తం 60 గ్రామాల ధ్రువీకరణ వివరాలు, ఛాయాచిత్రాలు జాతీయ జీవవైవిధ్య వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇటువంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టును చేపట్టడంపై ఆచార్య పడాల్, డాక్టర్ మాణిక్యకుమారిలను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అభినందించారు. విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందిస్తూ, ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగస్వాములను చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.